# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

## కరీంనగర్
రాజన్న సిరిసిల్ల , జగిత్యాల, పెద్దపల్లి

బుధవారం 07 అక్టోబర్ 2026






మత్తు మహమ్మారిని తరిమికొడదాం..

## యువత భవిష్యత్‌ను కాపాడుదాం

- డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి
- ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్

12లో




పెద్దపల్లి బీఆర్ఎస్ గొడవకు

## అధిష్టానం దిద్దుబాటు చర్యలు..!

- ఎల్.రమణ వద్ద సయోధ్య సమావేశం
- హరీశ్‌రావు సూచనలతో రంగంలోకి దిగిన అధిష్టానం

4లో

'దాసరి' కుట్రలో భాగమే

## బీసీలపై దాడులు

- ఘటనలు వ్యక్తిగతమైనవి కావు, బీసీ సమాజంపై జరిగిన దాడులే
- బీసీలపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలి

5లో





# గుప్పెడు మందితో మొదలై..

- దసరా నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీ మహాశక్తి దేవాలయం
- ఈనెల 11 నుంచి 20 వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు
- భవానీ దీక్షలు.. అన్నదానం.. చండీ పారాయణం.. దాండియా

### లక్షలాది భక్తుల కొంగుబంగారమై!

గుప్పెడు మందితో ప్రారంభమైన భక్తి ప్రస్థానం.. నేడు లక్షలాది మంది భక్తుల విశ్వాస క్షేత్రంగా విరాజిల్లుతోంది. కరీంనగర్ శ్రీ మహాశక్తి దేవాలయం దినదినాభివృద్ధి చెందుతూ జిల్లా ఎల్లలు దాటి భక్తులను ఆకర్షిస్తోంది. 2010 జూన్ 17న శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య స్వాముల చేతుల మీదుగా ప్రతిష్ఠించిన ఈ మహాక్షేత్రం 16 ఏళ్లుగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తి భావాన్ని పెంపొందిస్తోంది. అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయనే విశ్వాసంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

మిగతా 2 లో

# ఓట్ల చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఇండియా కూటమి గర్జన

- ఇందిరా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
- సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించి విచారణ జరిపించాలి
- కలెక్టర్‌కు వినతిపత్రం.. దిష్టిబొమ్మ దహనం



3లో

## విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించాలి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




4లో

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ఆధునిక విద్యావిధానాలను అందిపుచ్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించేలా పాఠశాలలు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

- వేములవాడ హంసిని హైస్కూల్లో ఐఐటీ, నీట్, సివిల్స్ పుస్తకాల ఆవిష్కరణ
- మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక విద్యావిధానాలను అందుపుచ్చుకోవాలని పిలుపు

# గుప్పెడు మందితో మొదలై..



గుప్పెడు మందితో ప్రారంభమైన భక్తి ప్రస్థానం.. నేడు లక్షలాది మంది భక్తుల విశ్వాస క్షేత్రంగా విరాజిల్లుతోంది. కరీంనగర్ శ్రీ మహాశక్తి దేవాలయం దినదినాభివృద్ధి చెందుతూ జిల్లా ఎల్లలు దాటి భక్తులను ఆకర్షిస్తోంది. 2010 జూన్ 17న శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య స్వాముల చేతుల మీదుగా ప్రతిష్ఠించిన ఈ మహాక్షేత్రం 16 ఏళ్లుగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తి భావాన్ని పెంపొందిస్తోంది. అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయనే విశ్వాసంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

- లక్షలాది భక్తుల కొంగుబంగారమై!
- దసరా నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీ మహాశక్తి దేవాలయం
- ఈనెల 11 నుంచి 20 వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు
- భవానీ దీక్షలు.. అన్నదానం.. చండీ పారాయణం.. దాండియా
- కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యవేక్షణలో ఏర్పాట్లు

---కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 6( ప్రజాజ్యోతి )

### నవరాత్రులకు మహాశక్తి ముస్తాబు

శ్రీ మహాశక్తి దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. విజయవాడ దుర్గమ్మ ఆలయ ఉత్సవాలను తలపించేలా పదిరోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 11 నుంచి 20 వరకు నిర్వహించనున్న ఉత్సవాల కోసం ఆలయ నిర్వాహకులు సన్నాహాలు ముమ్మరం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పర్యవేక్షణలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

భక్తులకు కేవలం అమ్మవారి దర్శనం మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక అనుభూతి, సేవా స్పూర్తి, సంప్రదాయ వైభవం అందేలా ఉత్సవాలను నిర్వహించనున్నారు.

### భవానీ దీక్షాపరులతో సందడి

ఆలయ ప్రతిష్ఠ ప్రారంభ రోజుల్లో కొద్దిమంది భక్తులతో ప్రారంభమైన భవానీ మాలాధారణ నేడు వేలాది మందికి చేరింది. గత రెండేళ్లుగా యువతలోనూ దుర్గామాల ధరించే వారి సంఖ్య పెరుగుతోంది. 108 రోజుల దీక్ష, మండల దీక్ష, నవరాత్రి దీక్షలను భక్తులు చేపట్టి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నారు.

ఎరుపు వస్త్రాలతో దీక్ష చేపట్టి అమ్మవారి సేవలో పాల్గొనే భక్తులతో నవరాత్రి రోజుల్లో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సందడితో నిండిపోనుంది.

### అమ్మ దర్శనంతో పాటు అన్న ప్రసాదం

శ్రీ మహాశక్తి దేవాలయంలో అన్నదానానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ప్రతి నెల సంకటహర చతుర్థి సందర్భంగా షడ్రుచులతో కూడిన అన్నప్రసాదాన్ని వేలాది మంది భక్తులకు అందిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల పది రోజుల్లోనూ ఆలయానికి వచ్చే భక్తులందరికీ అన్నప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంతమంది భక్తులు వచ్చినా చివరి వరుసలో కూర్చున్న భక్తుడి వరకు ఆప్యాయంగా భోజనం అందించడాన్ని నిర్వాహకులు ప్రత్యేకంగా భావిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకున్న తర్వాత 'అమ్మను చూశాం.. అమ్మ ప్రసాదం తిన్నాం' అనే తృప్తితో భక్తులు తిరిగి వెళ్లేలా అన్నదానం నిర్వహిస్తున్నారు.

### ఏడాది పొడవునా ఆధ్యాత్మిక సందడి

శ్రీ మహాశక్తి దేవాలయంలో నవరాత్రులు మాత్రమే కాకుండా ఏడాది పొడవునా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఉగాది పంచాంగ వేడుకలు, శ్రీరామనవమి, శ్రావణమాస ఉత్సవాలు, వరలక్ష్మీ వ్రతం, వసంత పంచమి సామూహిక అక్షరాభ్యాసం, మహాశివరాత్రి రుద్రాభిషేకం, సంకటహర చతుర్థి గణేశ్ హోమం, ఆషాఢ శాకాంబరి ఉత్సవాలు, నాగుల చవితి, గణేశ్ నవరాత్రులు, కృష్ణాష్టమి, దీపావళి, కార్తీకమాస అయ్యప్ప పడిపూజ, సంక్రాంతి గోదా కల్యాణం, ద్వాదశి తులసీ కల్యాణం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.ప్రతి పండుగకు ప్రత్యేక పూజలు, ప్రతి కార్యక్రమానికి ప్రత్యేక వైభవం ఉండేలా ఆలయ నిర్వాహకులు కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

### ఆధ్యాత్మిక వేడుకగా దాండియా

నవరాత్రి ఉత్సవాల్లో దాండియా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సాధారణ వినోద కార్యక్రమానికి భిన్నంగా భక్తి భావనతో, అమ్మవారిని స్మరిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనే ఆధ్యాత్మిక వేడుకగా దాండియాను నిర్వహిస్తున్నారు. కొద్దిమందితో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు వేలాది మంది పాల్గొనే స్థాయికి చేరింది.

### రోజుకో రూపంలో అమ్మవారి దర్శనం

ఈనెల 11 నుంచి 20 వరకు పదిరోజులపాటు నిర్వహించే నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. బాలాత్రిపురసుందరి, గాయత్రీదేవి, అన్నపూర్ణ, మహిషాసురమర్దిని, లలితాదేవి, మహాలక్ష్మి, దుర్గాదేవి, రాజరాజేశ్వరి తదితర రూపాల్లో అమ్మవారి అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.108 రకాల నైవేద్యాలు, చండీ పారాయణం, లక్ష్మీపూజ, సహస్రనామ పారాయణం, చండీ హోమం, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం తదితర కార్యక్రమాలతో పది రోజులపాటు ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడనుంది.

### అమ్మ దగ్గరకు రండి.. ఆశీస్సులు తీసుకెళ్లండి'

నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. నవరాత్రులు కేవలం ఉత్సవాలు మాత్రమే కాదని, అమ్మవారిని ఆరాధిస్తూ భక్తిని అనుభవించే ఆధ్యాత్మిక ప్రయాణమని పేర్కొన్నారు.

'అమ్మ దగ్గరకు రండి.. అమ్మ ఆశీస్సులు తీసుకెళ్లండి' అంటూ భక్తులను ఆయన ఆహ్వానించారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.







# ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపర్చాలి

**మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**సుల్తానాబాద్, అక్టోబరు 6 (ప్రజా జ్యోతి) :**
ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల, బాలికల హాస్టల్లో విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యుత్ వ్యవస్థ, పరిసరాలు, క్రీడా మైదానాన్ని పరిశీలించారు. హాస్టల్లో కొన్ని గదుల తలుపులు సరిగా లేవని, విద్యుత్ వైరింగ్లో సమస్యలు ఉన్నాయని గుర్తించిన కలెక్టర్.. అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల గ్రాంట్ ద్వారా అవసరమైన నిధులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేలా మైదానంలో గ్రౌండ్ లెవెలింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించడంతోపాటు, ఇంటర్మీడియట్లో జిల్లా స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించిన ప్రిన్సిపాల్ డాక్టర్ గోల్డీ బబ్లీ కౌర్, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనం

**చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం**

**ధర్మారం, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):**
జాతీయ పోషణ మాసాన్ని పురస్కరించుకుని ధర్మారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ కుమారస్వామి, ఐసీడీఎస్ సూపర్వైజర్ కె. బ్లాండిన్ హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం ఎంతో అవసరమని, ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పాలు, అంగన్వాడీల్లో అందించే బాలామృతాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించి, అందరితో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు బొమ్మగాని సతీష్ గౌడ్, అంగన్వాడీ టీచర్లు కరేటి రమాదేవి, కళావతి, భాగ్యలక్ష్మి, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.




# విద్యార్థుల అవసరాలకు అండగా కొలిపాక సంపత్

**ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ బాక్స్ బహూకరణ**

**పెద్దపల్లి, అక్టోబరు 6 (ప్రజా జ్యోతి):**
పెద్దపల్లి పట్టణంలోని 18వ వార్డు తెనుగువాడ ప్రభుత్వ పాఠశాలకు స్థానిక కౌన్సిలర్ కొలిపాక సంపత్ తన సొంత నిధులతో సౌండ్ బాక్స్ను అందజేశారు. ప్రార్థనలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఇది ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ.. విద్యార్థుల అవసరాలను గుర్తించి పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తానని తెలిపారు. సౌండ్ బాక్స్ను అందించిన కౌన్సిలర్కు




ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ చైర్మన్ కొలిపాక నర్సయ్య, గంగుల సతీష్, భూతగడ్డ తిరుపతి, వేల్పుల రాజేశం, మౌటం శంకర్ తదితరులు పాల్గొన్నారు

# ఓట్ల చోరీకి వ్యతిరేకంగా క ఇండియా కూటమి గర్జన

- ఇందిరా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
- సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించి విచారణ జరిపించాలి
- కలెక్టర్‌కు వినతిపత్రం.. దిష్టిబొమ్మ దహనం

**కరీంనగర్ బ్యూరో,అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి):**
ప్రజాస్వామ్య పరిరక్షణ వారంలో భాగంగా ఓట్ల చోరీ, ఎన్నికల సంఘం వ్యవహారశైలికి వ్యతిరేకంగా కరీంనగర్లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇందిరా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లిన నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌తో పాటు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా నాయకులు, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నేతలు మాట్లాడుతూ ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలని, సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను తక్షణమే తొలగించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి తమ డిమాండ్లను పంపించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు కలిగేలా వ్యవహరిస్తున్న ఎన్నికల సంఘం తీరును ప్రశ్నించారు. సీఈసీ జ్ఞానేష్‌కుమార్ ఇతర ఎన్నికల కమిషనర్ల అభిప్రాయాలను పక్కనపెట్టి



నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించి సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మాట్లాడుతూ ఎన్నికల సంఘం బీజేపీకి అనుబంధ విభాగంగా మారినట్లు పరిస్థితులు కనిపిస్తున్నాయని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, అణగారిన వర్గాల ఓట్ల తొలగింపు ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను అడ్డుకుంటామని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోట్లది ఓట్ల తొలగింపుపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమైన హక్కు అని, దాన్ని పరిరక్షించేందుకు ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ జ్ఞానేష్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేయడం ద్వారా నిరసన వ్యక్తం చేశామని, ఆయనను పదవి నుంచి తొలగించే వరకు ఉద్యమం కొనసాగుతుందని అన్నారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకుంటామని తెలిపారు. ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకుడు అంబటి జోజి రెడ్డి రాహుల్‌గాంధీ చేపడుతున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. జ్ఞానేష్‌కుమార్‌ను అరెస్టు చేయాలని కూడా ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓడితల ప్రణవ్‌బాబు, ఊట్కూరు నరేందర్‌రెడ్డి, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, బండారి శేఖర్, జిన్నం ప్రసాద్, పైడిపల్లి రాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీనివాస్ నాయక్, హేమంత్‌తో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పెద్దపల్లి బీఆర్ఎస్ గొడవకు అధిష్టానం దిద్దుబాటు చర్యలు..!

- ఎల్.రమణ వద్ద సయోధ్య సమావేశం
- హరీశ్‌రావు సూచనలతో రంగంలోకి దిగిన అధిష్టానం
- దాసరి, గంట రాములు యాదవ్, దాసరి ఉషాలతో ప్రత్యేకంగా చర్చలు




**పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 6, ప్రజా జ్యోతి:**
పెద్దపల్లి బీఆర్ఎస్‌లో బీసీ నాయకుల సమావేశం సందర్భంగా చోటుచేసుకున్న వివాదం పార్టీ అధిష్టానం దృష్టికి చేరడంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు దిద్దుబాటు చర్యలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. గ్రూపు రాజకీయాలు మరింత ముదరకముందే ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చి పార్టీని సమన్వయంతో ముందుకు నడిపించేందుకు అధిష్టానం ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు సమాచారం. ఇటీవల పెద్దపల్లి ఆర్ఆర్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో చోటుచేసుకున్న గొడవ తీవ్ర చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. సమావేశానికి కొందరు బీసీ నాయకులను ఎందుకు ఆహ్వానించలేదన్న అంశంపై తలెత్తిన వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనపై ఇరువర్గాల వారు పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు.

**అధిష్టానం దృష్టి**

ఈ పరిణామాలపై పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పెద్దపల్లిలో పరిస్థితి మరింత చేయి దాటకముందే ఇరువర్గాల మధ్య సయోధ్య కుదర్చాలని సూచించిన నేపథ్యంలో పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ ఎల్.రమణ రంగంలోకి దిగినట్లు సమాచారం. ఈ మేరకు సోమవారం జగిత్యాలలోని తన నివాసంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, బీసీ నాయకుడు గంట రాములు యాదవ్, దాసరి ఉష తదితరులతో ఎల్.రమణ ప్రత్యేకంగా సమావేశమైనట్లు తెలుస్తోంది. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు, నాయకుల మధ్య నెలకొన్న విభేదాలు, పార్టీపై వాటి ప్రభావం తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం.

**గ్రూపు రాజకీయాలకు చెక్..?**

పెద్దపల్లి బీఆర్ఎస్‌లో కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు తాజాగా బీసీ సమావేశం ఘటనతో బహిర్గతం కావడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో నాయకుల మధ్య విభేదాలు రచ్చకెక్కడంతో అధిష్టానం అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇరువర్గాలను ఒకే తాటిపైకి తీసుకురావడానికి ఎల్.రమణ ద్వారా సయోధ్య ప్రయత్నాలు సాగినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇకపై వ్యక్తిగత, గ్రూపు విభేదాలకు తావివ్వకుండా పార్టీ ఆదేశాలకు అనుగుణంగా సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించినట్లు సమాచారం. స్థానికంగా నెలకొన్న విభేదాలకు తాత్కాలికంగా తెరదించేలా ఈ భేటీ సాగినప్పటికీ.. రానున్న రోజుల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ నేతలు ఏ మేరకు సమన్వయంతో ముందుకు సాగుతారనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

బీసీ నాయకుల సమావేశంతో మొదలైన వివాదం చివరకు పార్టీ అధిష్టానం జోక్యానికి దారితీయడం.. పెద్దపల్లి బీఆర్ఎస్‌లో అంతర్గత సమీకరణాలపై మరోసారి చర్చకు తెరలేపింది.

# విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- వేములవాడ హంసిని హైస్కూల్లో ఐఐటీ, నీట్, సివిల్స్ పుస్తకాల ఆవిష్కరణ
- మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక విద్యావిధానాలను అందుపుచ్చుకోవాలని పిలుపు




**వేములవాడ, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి):**
మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ఆధునిక విద్యావిధానాలను అందిపుచ్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించేలా పాఠశాలలు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని హంసిని హైస్కూల్లో ఐఐటీ, నీట్, సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు ఉపయోగపడే ప్రత్యేక పుస్తకాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో ఇంటర్మీడియట్ తర్వాత మాత్రమే పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకునే పరిస్థితి ఉండేదని, కానీ ప్రస్తుతం హైస్కూల్ స్థాయి నుంచే అవగాహన కల్పించేలా పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, స్కిల్ యూనివర్సిటీలు, అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో ఐఐటీ, నీట్, సివిల్స్ ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



# వందేళ్లు పూర్తి చేసుకున్న వైజ్ఞానిక వేదాంత సభ

**ముస్తాబాద్, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** శ్రీ పరమానంద బైరి అంబయ్య ఆర్య రాజయోగి శిష్య బృందం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వైజ్ఞానిక వేదాంత సభ వందేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ముస్తాబాద్ పోతుగల్ దారిలోని ఆచల గురు ఆశ్రమంలో మంగళవారం శతాబ్ది ఉత్సవాలు, ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. బైరి అంబయ్య ధర్మపత్ని నర్సమ్మ ఆధ్వర్యంలో ఈ సభ కొనసాగుతోందని, గత వందేళ్లుగా ప్రజల్లో ఆధ్యాత్మిక, వేదాంత భావాలను పెంపొందిస్తున్నామని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదాంత తత్వ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షుడు కంచం రాజయ్య, జిల్లా అధ్యక్షుడు వీరయ్య, నాయకులు విట్టల్, ఐలయ్య, పోశయ్య, రామస్వామి, నిర్మల్ జిల్లా భక్తులు పాల్గొన్నారు.






# బిల్లుల్లో గోల్‌మాల్‌కు సహకరించం

### ఉప సర్పంచుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్



**కొనరావుపేట, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** గ్రామ పంచాయతీ బిల్లుల చెల్లింపుల విషయంలో నిబంధనలు, పారదర్శకత తప్పనిసరిగా పాటించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఉప సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి తిక్కల నవీన్ స్పష్టం చేశారు. తప్పుడు బిల్లులపై తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సంతకాలు చేయబోమని తేల్చి చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉప సర్పంచులు సంతకాలు చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, బిల్లులు, ఖర్చులకు సంబంధించిన పూర్తి ఆధారాలను తమకు చూపించాలని డిమాండ్ చేశారు. వాస్తవ ఖర్చు కంటే అధిక మొత్తాలతో రూపొందించిన బిల్లులపై సంతకాలు చేయమని, నిబంధనలు ఉల్లంఘిస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. పంచాయతీ నిధులు ప్రజల సొమ్మని, వాటి వినియోగంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

# 'దాసరి' కుట్రలో భాగమే బీసీలపై దాడులు

### బీసీ సంఘాల నాయకులు

- ఘటనలు వ్యక్తిగతమైనవి కావు, బీసీ సమాజంపై జరిగిన దాడులే
- బీసీలపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలి



**పెద్దపల్లి, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి):** పెద్దపల్లి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన బీఆర్ఎస్ బీసీ సమావేశంలో చోటుచేసుకున్న ఘటనలు వ్యక్తిగత దాడులు కాదని, బీసీ సమాజంపైనే జరిగిన దాడులుగా భావిస్తున్నామని నాలుగు బీసీ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రేరేపితంగానే ఈ ఘటనలు జరిగాయని ఆరోపిస్తూ మంగళవారం పెద్దపల్లిలోని ఆర్కే గార్డెన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో బహుజన ప్రజాస్వామిక వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తాడూరి శ్రీమన్నారాయణ, పెద్దపల్లి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కందుల సదాశివ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామిని రాజేశం మాట్లాడుతూ.. బీసీలపై కేసులు నమోదు చేయించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే ఆ కేసులను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా బీసీ ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీసీల్లో పెరుగుతున్న ఐక్యతను దెబ్బతీసేందుకు కులాల మధ్య చిచ్చు పెట్టే యత్నాలు జరుగుతున్నాయని, బీసీల రక్షణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక 'బీసీ రక్షణ చట్టం' తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కందుల అశోక్‌పటేల్, చర్లపల్లి సురేష్‌గౌడ్, మేడగోని శ్రీనివాస్‌గౌడ్, బొడ్డుపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# ర్యాకల్ దేవ్ పల్లిలో ఫామ్ పాండ్ పనులు ప్రారంభం

**ఎలిగేడు, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** ఎలిగేడు మండలం ర్యాకల్ దేవ్ పల్లి గ్రామంలో వివిజి రాంజీ పథకం కింద ఫామ్ పాండ్ (రైతు కుంట) నిర్మాణ పనులను మంగళవారం గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జల మట్టాన్ని పెంచేందుకు ఫామ్ పాండ్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి నీటి బొట్టును సంరక్షించడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడంతో పాటు నీటి ఎద్దడి నివారణకు ఈ పనులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొడిగె శివకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కుక్క అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్ సాగర్, వార్డు సభ్యులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.




# హర్ ఘర్ జల్ కార్యక్రమంపై అవగాహన కల్పించిన సర్పంచ్

**ఎలిగేడు, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** మండలంలోని ర్యాకల్ దేవ్ పల్లి గ్రామంలో మంగళవారం సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ జల్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీటి వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఉండేలా చూసుకోవాలని, నీటి వృథాను అరికట్టాలని సర్పంచ్ సూచించారు. వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచి నీటి కలుషితాన్ని నివారించాలని కోరారు. స్వచ్ఛమైన తాగునీటితో అనారోగ్య సమస్యలను అరికట్టవచ్చని, గ్రామంలోని ప్రతి ఇంటికీ సురక్షిత నీరందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుక్క అశోక్, వార్డు సభ్యుడు సతీష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



# రోజుకు నాలుగైదుసార్లు ఫ్యూజ్ వైర్ కాలిపోతోంది

## రైతుల ఆవేదన

**ముస్తాబాద్, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** చిప్పలపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు నెలలుగా రోజుకు నాలుగైదుసార్లు ఫ్యూజ్ వైర్ కాలిపోతుండటంతో వ్యవసాయ పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ విద్యుత్ నిలిచిపోతుండటంతో పాటు మోటార్లు కూడా కాలిపోయి ఆర్థికంగా నష్టపోతున్నామని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించి, నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కొమ్మటి రాజమల్లు, కొమ్మటి శ్రీనివాస్, చందన నర్సయ్య, కుంభం నర్సింలు, గడిచేర్ల అశోక్, పారిపెల్లి కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

# సాయిలు తాత ఇక లేరు

## గుల్లకోటలో విషాదం

### గ్రామ సమస్యల పరిష్కారానికి పెద్దదిక్కుగా నిలిచిన పెద్దమనిషి

**ఎండపల్లి, అక్టోబరు 6 (ప్రజా జ్యోతి):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాలకుర్తి విజయ మామ, గ్రామ పెద్ద పాలకుర్తి సాయిలు (సాయిలు తాత) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. గ్రామ సమస్యల పరిష్కారానికి, కుటుంబ, భూ తగాదాల సామరస్య పరిష్కారానికి ఆయన ఎంతో కృషి చేశారు. చిన్న సమస్యలు పోలీస్ స్టేషన్ వరకు వెళ్లకుండా గ్రామంలోనే పరిష్కరిస్తూ అందరికీ ఆత్మీయుడిగా, 'సాయిలు తాత'గా గుర్తింపు పొందారు. ఆయన మృతితో గుల్లకోట గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామస్తులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



# రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థుల ఎంపిక

**పెద్దపల్లి, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** అండర్-13 సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు పెద్దపల్లి గాయత్రీ విద్యానికేతన్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. గోదావరిఖనిలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచడంతో వీరు ఎంపికయ్యారు. ఈ నెల 16న హన్మకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీదేవి అభినందించి, క్రీడల్లోనూ రాణించి పేరు




తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజేందర్, పీఈటీలు అజయ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదిపై కౌంటర్ కేసు పెట్టడం సరికాదు

- **బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిట్టల మనోహర్**
- **వేములవాడలో న్యాయవాదుల నిరసన**

**వేములవాడ, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** సిరిసిల్ల న్యాయవాది బోదాసు రమేష్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా, తిరిగి న్యాయవాదిపైనే కౌంటర్ కేసు నమోదు చేయడం దారుణమని వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిట్టల మనోహర్, మాజీ అధ్యక్షుడు గుడిసె సదానందం ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కోర్టు ప్రధాన ద్వారం వద్ద న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసు రాజీ కోసం పోలీసులు న్యాయవాదిపై కేసు పెట్టడం హక్కులకు భంగం కలిగించడమేనన్నారు. వెంటనే ఆ కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్



న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, దేవేందర్, క్రాంతి కుమార్, శ్రీకాంత్, మహిళా న్యాయవాదులు అన్నపూర్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## పెద్దపల్లి ఎఫ్ఆర్వో టి. సతీష్ కుమార్

- **రాములపల్లి, ర్యాకల్ దేవ్ పల్లిలో అటవీ, పోలీసు శాఖల సంయుక్త 'కార్డన్ అండ్ సెర్చ్'**
- **8 వేట వలలు, 14 ఉచ్చులు స్వాధీనం; అక్రమ వేటపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిక**




**ఎలిగేడు, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి):** వన్యప్రాణుల సంరక్షణ ప్రతి పౌరుడి సమిష్టి బాధ్యత అని పెద్దపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్వో) టి. సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. పెద్దపల్లి డిఎఫ్వో ఆదేశాల మేరకు ఎలిగేడు మండలం రాములపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ర్యాకల్ దేవ్ పల్లి గ్రామంలో పెద్దపల్లి, మంథని అటవీ రేంజ్‌ల సిబ్బంది, ఎలిగేడు పోలీసుల సహకారంతో సోమవారం సంయుక్తంగా 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో అటవీ ప్రాంతంలో అమర్చిన 8 వేట వలలు, 14 ఉచ్చులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వన్యప్రాణుల వారోత్సవాలను పురస్కరించుకుని గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో సతీష్ కుమార్ మాట్లాడుతూ.. అక్రమంగా అటవీ చెట్లను నరికివేయడం, వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా తీవ్రమైన నేరమని హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, అక్రమ వేటకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వోలు టి. సతీష్ కుమార్, ఎం. వినయ్ నాయక్‌లతో పాటు డిఆర్వోలు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా అంగన్ మిలన్ సేవ - అంగన్‌వాడీ ఉత్సవ్

- మోదీ జన్మదినోత్సవ 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా అలుగునూర్-2 లో వేడుకలు
- అంగన్‌వాడీ టీచర్ లతకు ఘన సన్మానం; చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్ల పంపిణీ

**తిమ్మాపూర్, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం అలుగునూర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో 'అంగన్ మిలన్ సేవ - అంగన్‌వాడీ ఉత్సవ్' కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల సమగ్ర అభివృద్ధికి, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించడంలో ఈ పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం చిన్నారుల సంరక్షణలో అంకితభావంతో సేవలు అందిస్తున్న స్థానిక అంగన్‌వాడీ టీచర్



లతను ఘనంగా సన్మానించి, ఆమె సేవలను కొనియాడారు. అనంతరం చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షుడు చిందం అంజి, అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లల తల్లులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# 15 రోజులుగా నీళ్లేవు.. రోడ్డెక్కిన మహిళలు

- తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో కొండాపూర్ స్టేజీ వద్ద ఖాళీ బిందెలతో రాస్తారోకో
- ట్రాక్టర్ ద్వారా నీటి సరఫరా, పైప్‌లైన్ మరమ్మతులు చేపడతామని పంచాయతీ కార్యదర్శి హామీ



**చిగురుమామిడి, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి):** మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసమై గత 15 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ఆగ్రహించిన కొండాపూర్ గ్రామం 9వ వార్డుకు చెందిన మహిళలు మంగళవారం రహదారిపై ఆందోళనకు దిగారు. కొండాపూర్ స్టేజీ వద్ద ఖాళీ బిందెలతో హుస్నాబాద్-కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. కొత్తపల్లి--హుస్నాబాద్ ఫోర్‌లేన్ రహదారి విస్తరణ పనుల్లో జేసీబీలతో తవ్వకాలు చేపట్టడం వల్లే మిషన్ భగీరథ పైప్‌లైన్ దెబ్బతిన్నదని, సర్పంచ్ నిర్లక్ష్యం వల్లే మరమ్మతులు ఆలస్యమవుతున్నాయని మహిళలు ఆరోపించారు. తాగునీటి కోసం అర్ధరాత్రి వరకు క్యూలో నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రాస్తారోకోతో ప్రధాన రహదారిపై ఇరువైపులా వాహనాలు, బస్సులు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి అమృత వర్షిణి సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. తాత్కాలికంగా ట్రాక్టర్ ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తామని, అలాగే దెబ్బతిన్న భగీరథ పైప్‌లైన్‌కు వెంటనే మరమ్మతులు పూర్తి చేయిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

# రోగుల రద్దీ పెరిగినా వైద్య సేవల్లో నాణ్యత తగ్గొద్దు: కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రభుత్వ ఆసుపత్రి, జడ్పీహెచ్ఎస్‌లలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

**పెద్దపల్లి, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్నందున నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులతో ఓర్పుగా, మర్యాదగా వ్యవహరించాలని సూచించారు.అనంతరం పెద్దబొంకూర్ జడ్పీహెచ్ఎస్‌ను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ప్రాథమిక స్థాయిలోనే చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్, ఆసుపత్రి సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



## బాణసంచా దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ



**కరీంనగర్, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** దీపావళి సందర్భంగా తాత్కాలిక బాణసంచా దుకాణాల ఏర్పాటుకు ఈ నెల 17లోగా దరఖాస్తులు సమర్పించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతో పాటు ఆధార్, పదో తరగతి మెమో, రూ.600 చలాన్, ఫైర్, రెవెన్యూ, మున్సిపల్ ఎన్ఓసీల ప్రతులను సమర్పించాలని సూచించారు. అనుమతించిన స్థలాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేయాలని, ప్రతి షాపు వద్ద అగ్నిమాపక పరికరాలు, ఇసుక, నీటి బకెట్లు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా విక్రయాలు జరిపినా, పరిమితికి మించి నిల్వ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు.



## అనంతారంలో బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు

**ఇల్లంతకుంట, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామంలో సద్దుల బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా మంగళవారం గ్రామ సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేశం ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. గ్రామంలోని బ్రిడ్జి సమీపంలో ఉన్న ముళ్ల పొదలు, చెత్త చెదారాన్ని జేసీబీ సహాయంతో తొలగించి స్థలాన్ని శుభ్రపరిచారు. మహిళలు, గ్రామస్తులు నిమజ్జన స్థలానికి వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డును చదును చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారుతి, ఉపసర్పంచ్ కదం జయంత్, వార్డు సభ్యులు మల్యాల రాజశేఖర్, పీటర్, రమేష్, నాయకులు నర్సయ్య, గోనెపల్లి వెంకటేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితునికి పరామర్శ



**గంగాధర, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** గంగాధర మండలం సర్వారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కరబూజ తిరుపతిగౌడ్ కుమారుడు కరబూజ ప్రణయ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం ఆస్పత్రికి వెళ్లి ప్రణయ్‌ను పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పుటుకం రవీంద్రనాథ్ ఠాగూర్, వేముల దామోదర్, శ్రీమల్ల మేఘరాజు, రామిడి సురేందర్, గంగాధర సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనం

**చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం**

**ధర్మారం, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** జాతీయ పోషణ మాసాన్ని పురస్కరించుకుని ధర్మారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ కుమారస్వామి, ఐసీడీఎస్ సూపర్వైజర్ కె. బ్లాండిన్ హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం ఎంతో అవసరమని, ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పాలు, అంగన్వాడీల్లో అందించే బాలామృతాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించి, అందరితో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు బొమ్మగాని సతీష్ గౌడ్, అంగన్వాడీ టీచర్లు కరేటి రమాదేవి, కళావతి, భాగ్యలక్ష్మి, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

## కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

**మల్లాపూర్, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** కడుపునొప్పి భరించలేక మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మారానికి చెందిన బింగిసారపు శివ (23) గతంలో పెద్దపేగు శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ తరచూ తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం తోట నుంచి ఇంటికి వచ్చిన శివ, తీవ్ర మనస్తాపంతో ఇంట్లోని రేకుల షెడ్డులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి సోమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏ. అనిల్ తెలిపారు.



# వరి కోతలు ముమ్మరం.. హార్వెస్టర్ల రిపేర్లకు తగ్గిన గిరాకీ

**శంకరపట్నం, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** శంకరపట్నం మండలంలో వానకాలం వరి కోతలు ఊపందుకున్నాయి. కోతల ప్రారంభంతో హార్వెస్టర్లు పొలాల్లో దిగుతుండగా, మరికొన్నింటిని యజమానులు మెకానిక్ షెడ్లకు రిపేర్ కోసం తీసుకెళ్తున్నారు. అయితే, ఈసారి సరైన వర్షాలు లేక పంట దిగుబడి తగ్గడంతో హార్వెస్టర్ల రిపేర్లకు గిరాకీ అంతంత మాత్రమే ఉందని స్థానిక మెకానిక్‌లు చెబుతున్నారు. గతంలో ఇదే సమయానికి షెడ్ల వద్ద 10 నుంచి 15 హార్వెస్టర్లు క్యూలో ఉండేవని, ప్రస్తుతం రోజుకు 1-2 మాత్రమే వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.



# అట్య-పట్య రాష్ట్ర స్థాయి క్రీడలకు 'సాన్వి' విద్యార్థులు ఎంపిక

- ఈ నెల 10, 11, 12 తేదీల్లో కోరుట్లలో జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ క్రీడోత్సవాలు
- కరీంనగర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్న సాన్వి జూనియర్ కళాశాల డిఫెన్స్ అకాడమీ క్రీడాకారులు




**కొత్తపల్లి, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి):** జగిత్యాల జిల్లా కోరుట్ల మినీ స్టేడియంలో ఈనెల 10, 11, 12వ తేదీలలో నిర్వహించనున్న 'రాష్ట్రస్థాయి సీనియర్ మెన్ అండ్ వుమెన్ అట్య-పట్య' క్రీడా పోటీలకు కరీంనగర్ సాన్వి జూనియర్ కళాశాల డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ ఎర్రంశెట్టి మునీందర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా జట్టు తరపున ప్రతిభ కనబరిచి ఈ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. బాలికల విభాగం నుంచి డి.నవనీత, కె.హరిణి, కె.శ్రీవర్షిణి, పి.శ్రావిక, ఆర్.రుచిత ఎంపికవ్వగా, బాలుర విభాగం నుంచి పి.అభిరామ్ రావు, సాత్విక్, విజయ్ కుమార్, శివతేజ, రోహిత్, నిత్యసాయిలు కరీంనగర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ ఎర్రంశెట్టి మునీందర్, ప్రిన్సిపల్ రత్నాకర్, కోచ్‌లు శ్రీనివాస్, లక్ష్మణ్, నవ్య, స్వర్ణ, అనీష్, అధ్యాపకులు మరియు విద్యార్థులు ఘనంగా అభినందించారు.

# చిన్ననాటి నుంచే పోటీ పరీక్షలకు పునాది







**ఐఐటీ--నీట్--సివిల్స్ పుస్తకాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**వేములవాడ, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** వేములవాడలోని హంసిని డిజి హైస్కూల్ కరస్పాండెంట్ నరాల సంతోష్ 4 నుంచి 8వ తరగతి విద్యార్థుల కోసం రచించిన ఐఐటీ, నీట్, సివిల్స్ పోటీ పరీక్షల పుస్తకాలను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. చిన్న వయసు నుంచే నాణ్యమైన విద్యతో పాటు పోటీ పరీక్షలకు బలమైన పునాది కల్పించేందుకు నరాల సంతోష్ ఈ పుస్తకాలను రచించడం అభినందనీయమన్నారు. ఈ పుస్తకాల ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు, నాయకులు ప్రతాప రామకృష్ణ, కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, తూమ్ మధు, స్కూల్ డైరెక్టర్ సన్నిధి వెంకట కృష్ణ, టేస్మా అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పుట్టింటి ప్రయాణంలో పసిడి జాగ్రత్త!

- మహిళలు అప్రమత్తంగా ఉండాలి కోరుట్ల సీఐ కే. లక్ష్మీనారాయణ
- పుట్టింటికి వెళ్లే సమయంలో ఆభరణాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

**కోరుట్ల, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి)**

దసరా పండుగను పురస్కరించుకుని మహిళలు పుట్టింటికి వెళ్లే సమయంలో తమ వెంట తీసుకెళ్లే బంగారు ఆభరణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ కే. లక్ష్మీనారాయణ సూచించారు. పండుగ సమయంలో ఇళ్లకు తాళాలు వేసి కుటుంబ సభ్యులు బయటకు వెళ్లే సందర్భాలను దొంగలు ఆసరాగా చేసుకునే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు.

### పండుగ ప్రయాణాల్లో అప్రమత్తతే రక్షణ

దసరా పండుగ సందర్భంగా మహిళలు, కుటుంబ సభ్యులు పుట్టింటికి లేదా బంధువుల ఇళ్లకు వెళ్లడం సాధారణమని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సమయంలో ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువులను ఉంచి వెళ్లకుండా సాధ్యమైనంత వరకు సురక్షిత ప్రదేశంలో భద్రపరచుకోవాలని సూచించారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే విషయాన్ని ఇతరులకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

### బంగారు ఆభరణాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు

పండుగల సమయంలో మహిళలు ఎక్కువగా బంగారు ఆభరణాలు ధరించి ప్రయాణాలు చేసే అవకాశం ఉంటుందని, అందువల్ల బస్సులు, రద్దీ ప్రాంతాలు, మార్కెట్లు, దేవాలయాల వద్ద మరింత జాగ్రత్తగా ఉండాలని సీఐ సూచించారు. ప్రయాణ సమయంలో నగలు కనిపించేలా కాకుండా భద్రంగా ఉంచుకోవాలని, అపరిచిత వ్యక్తులు ఇచ్చే సహాయాన్ని వెంటనే నమ్మవద్దని తెలిపారు.

### ఇల్లు వదిలి వెళ్లే ముందు ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఇంటికి తాళం వేసి పండుగకు వెళ్తున్న వారు విలువైన వస్తువులను ఇంట్లో బహిరంగంగా ఉంచకూడదని సీఐ లక్ష్మీనారాయణ సూచించారు. ఇంటి తలుపులు, కిటికీలు సక్రమంగా మూసి ఉన్నాయో లేదో పరిశీలించిన తర్వాతే బయటకు వెళ్లాలని చెప్పారు. వీలైనంత వరకు ఇంటి పరిసరాల్లో నమ్మకమైన వ్యక్తులకు సమాచారం అందించి, అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని




కోరారు.

### అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం

పండుగ వేళల్లో కాలనీలు, ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాల్లో అపరిచిత వ్యక్తులు లేదా అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు కనిపిస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల సీఐ కే. లక్ష్మీనారాయణ సూచించారు. ఎలాంటి అనుమానం కలిగినా ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

### ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత

పండుగను ప్రజలంతా ఆనందంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. ప్రజల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, అయితే ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ అప్రమత్తంగా వ్యవహరించినప్పుడే నేరాలను మరింత సమర్థవంతంగా అరికట్టగలమని ఆయన పేర్కొన్నారు.

# రైతును రాజును చేసిన కేసీఆర్..

**రిజిస్ట్రేషన్ల పేరుతో పరుగులు పెట్టిస్తున్న రేవంత్: దావ వసంత సురేష్**

- రూ. 134 కోట్ల రోళ్ల వాగు ప్రాజెక్టు గేట్ల ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శ
- ఫార్మర్ రిజిస్ట్రేషన్, అగ్రి స్టాక్ పేరిట రైతులకు కొత్త తిప్పలు తెచ్చారని ఆరోపణ



**జగిత్యాల, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి):**

బీఆర్ఎస్ హయాంలో రూ. 134 కోట్లతో 90 శాతం పనులు పూర్తయిన రోళ్ల వాగు ప్రాజెక్టుకు గేట్లు (షట్టర్లు) బిగించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ విమర్శించారు. మంగళవారం బీర్పూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోళ్ల వాగు ప్రాజెక్టుకు 1 టీఎంసీ నీటి నిల్వకు సరిపడేలా షట్టర్లు బిగించి, మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్, అగ్రి స్టాక్ పేరిట రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకువచ్చి అన్నదాతలను తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తోందని వసంత సురేష్ ధ్వజమెత్తారు. "రైతుబంధు ఇచ్చిన చేతులు కేసీఆర్వి అయితే, రైతును రిజిస్ట్రేషన్ పేరుతో పరుగులు పెట్టిస్తున్న చేతులు రేవంత్వి" అని ఆమె ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి వసతులతో రైతును రాజును చేస్తే.. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పథకానికి కొర్రీలు పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ వల్ల ఒక్క రైతు నష్టపోయినా ప్రభుత్వమే బాధ్యత వహించాలని, రైతుల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నేరెళ్ల సుమన్ గౌడ్, మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, మాజీ ఎంపీపీ మాసర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపసర్పంచుల ఫోరం నూతన కార్యవర్గం ఎన్నిక

**బుగ్గారం, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):**

బుగ్గారం మండల ఉపసర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోరం మండల అధ్యక్షుడిగా నక్క సునీల్, ఉపాధ్యక్షుడిగా గ్నేనీ సురేందర్, ప్రధాన కార్యదర్శిగా మ్యాకల వెంకటేష్, కోశాధికారిగా చట్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా బంద్ర అంజి, గజ్జెల విజయ్, కోల శ్రీనివాస్, నార్ల బుచ్చయ్య, గుర్రం తిరుపతి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ మండలంలోని ఉపసర్పంచుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ఐక్యంగా కృషి చేస్తామని స్పష్టం చేశారు.



## జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

**మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్**

**మంథని, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):**

మంథని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కోట ఉష, అధ్యాపక బృందం చైర్మన్ను శాలువాతో సత్కరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ సహకారంతో ఉదయం అల్పాహారం అందిస్తున్నామని, ఇప్పుడు మధ్యాహ్న భోజనం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం లభించి విద్యపై శ్రద్ధ చూపుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు మాచిడి రాజు గౌడ్, పెంటరి రాజు, ఎల్లెంకి వంశీధర్, నాయకుడు జంబోజు సమ్మయ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

### మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్

**కాల్వ శ్రీరాంపూర్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం హర్షణీయమని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ అన్నారు. కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఆయన పరిశీలించి, విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంతో పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు సోన్నాయి టెంకం శివరామకృష్ణ, తాండ్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆటో యూనియన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ గౌడ్

**వేములవాడ, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** వేములవాడ డివిజన్ ఆటో యూనియన్ అధ్యక్ష, కమిటీ ఎన్నికలు మంగళవారం హోరాహోరీగా జరిగాయి. ఈ ఎన్నికల్లో డివిజన్ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ విజయం సాధించారు. నూతనంగా ఎన్నికైన శ్రీనివాస్ గౌడ్‌ను వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూమ్ మధు, కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆటో కార్మికుల సంక్షేమానికి నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆటో యూనియన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ మేట్ ఆత్మహత్యాయత్నం

**గంగాధర, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** ఎలాంటి కారణం లేకుండా ఉపాధి హామీ మేట్ ఉద్యోగం నుంచి తొలగించడంతో చర్లపల్లి (ఆర్) గ్రామానికి చెందిన దళిత మహిళ మహంకాళి రజిత నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. గతంలో అక్రమాలకు పాల్పడి తొలగించబడిన వ్యక్తిని మళ్లీ విధుల్లోకి తీసుకుని, తనను తొలగించడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# ఇందుర్తిలో ఘనంగా పోషణ్ అభియాన్ వేడుకలు



**చిగురుమామిడి, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ చింతపూల నరేందర్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, ఉచితంగా పలకలు పంపిణీ చేయడంతో పాటు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. చిన్నారుల చదువుతో పాటు ఆరోగ్యం, పౌష్టికాహారం, పరిశుభ్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని, అంగన్‌వాడీ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. పోషకాహార లోపాన్ని నివారించి, ప్రీ-స్కూల్ విద్య ద్వారా చిన్నారుల నైపుణ్యాలను పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రజిత, పంచాయితీ కార్యదర్శి స్వర్ణలత, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు విజయ, మావూరమ్మ, ఇందిర, సరస్వతి, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చొరవతో ప్రగతి పథంలో సారంగాపూర్



**సారంగాపూర్, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** సారంగాపూర్ మండల కేంద్రంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. డ్రైనేజీలు, సి.సి. రోడ్లు, మహిళా సంఘ భవనం, రామాలయంలో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేయడంతో పాటు లో-వోల్టేజీ సమస్య పరిష్కారానికి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. అనంతరం స్థానిక రైతువేదికలో కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చేకుట అరుణ-శేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతోనే గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సొల్లు సురేందర్, పుష్పనాథ్, శ్రీనివాస్, రాధ-రాజు, సీనియర్ నాయకులు రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కృత్రిమ మేధపై జర్నలిస్టులకు అవగాహన అవసరం

- సీనియర్ జర్నలిస్టు ముద్దం నరసింహస్వామి
- మల్లాపూర్‌లో 'ఆధునిక జర్నలిజం--కృత్రిమ మేధ' పుస్తకావిష్కరణ
- తప్పుడు సమాచారాన్ని, డీప్‌ఫేక్‌లను గుర్తించడంలో టెక్నాలజీ కీలకమని వెల్లడి



**మల్లాపూర్, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి):** మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వృత్తిలో ముందుకు సాగాలని సీనియర్ జర్నలిస్టు ముద్దం నరసింహస్వామి సూచించారు. మంగళవారం మల్లాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రచించిన 'ఆధునిక జర్నలిజం--కృత్రిమ మేధ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వర్కింగ్ జర్నలిస్టులకు పుస్తకాలను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన సొంత గ్రామంలో తాను రచించిన నాలుగో పుస్తకాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు వేగంగా, నిర్భయంగా చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రస్తుత పరిస్థితుల్లో కృత్రిమ మేధ పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వార్తల సేకరణ, విశ్లేషణలో ఏఐని సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చుని, అలాగే సాంకేతికత ద్వారా మార్ఫింగ్‌లు, డీప్‌ఫేక్‌లు మరియు తప్పుడు వార్తలను సులభంగా గుర్తించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు గుగ్గిళ్ల శేఖర్, టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు రాంప్రసాద్‌తో పాటు పలువురు వర్కింగ్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలతో చిన్నారుల ఆరోగ్యానికి బలమైన పునాది

## మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



**వేములవాడ, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. వేములవాడ పట్టణంలోని 14వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన 9వ మాస పోషణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం, గుడ్లు వంటి పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించి కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, కౌన్సిలర్ తూమ్ మధు, వార్డు ఆఫీసర్ పర్శరామ్, అంగన్వాడీ సూపర్వైజర్, టీచర్లు, ఆశా వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- **నాణ్యతా లోపాలు, అధికంగా ఎంబీ రికార్డులు చేశారని ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ఆరోపణ**
- **బాధ్యులైన కాంట్రాక్టర్, పంచాయతీరాజ్ ఇంజనీర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి**

**ధర్మారం, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి):** ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామంలో సమ్మక్క-సారలమ్మ కమాన్ నుంచి శ్రీకృష్ణ దేవాలయం వరకు నిర్మించిన సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, నాసిరకం మెటీరియల్ ఉపయోగించారని గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డు నిర్మాణ పనులపై సాంకేతిక నిపుణులతో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. విచారణలో అవకతవకలు తేలితే బాధ్యులైన కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదే ఫిర్యాదులో గ్రామపంచాయతీ భవనం పెయింటింగ్, మిషన్ భగీరథ మరమ్మతులు, అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ పనుల్లో జరిగిన అక్రమాలపై కూడా విచారణ జరిపించాలని కోరారు. అలాగే సీసీ రోడ్డు లేని దారుల్లో పోసిన మొరం పనుల్లో, క్షేత్రస్థాయిలో జరిగిన పని కంటే ఎంబీ (మెజర్‌మెంట్ బుక్) రికార్డుల్లో అధికంగా నమోదు చేశారని ఆరోపించారు. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి, రికార్డులతో సరిపోల్చాలని,



ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కొండయ్యపల్లిలో రేపటి నుంచి భూభారతి రీ-సర్వే

**గంగాధర, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** మండలంలోని కొండయ్యపల్లి గ్రామంలో బుధవారం నుంచి భూభారతి రీ-సర్వే ప్రక్రియ ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా మంగళవారం సర్వే డీఐ గణపతి గ్రామస్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అంబటి రజిత మాట్లాడుతూ.. రైతులందరూ తమ భూములకు సంబంధించిన పత్రాలతో సర్వేలో పాల్గొనాలని సూచించారు. సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించి భూభారతి రీ-సర్వే ప్రక్రియను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.






## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాధితునికి రూ.1.75 లక్షల వైద్య సాయం

**ఇల్లందకుంట, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబు చొరవతో బుజునూర్ గ్రామానికి చెందిన మాచర్ల మొగిలికి రూ.1.75 లక్షల వైద్య సాయం మంజూరైంది. మొగిలి అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ప్రణవ్ బాబు వెంటనే స్పందించి, రూ.1,75,000 విలువైన ఎల్‌ఓసీ (రూజ) అనుమతి పత్రం అందేలా కృషి చేశారు. సమయానికి ఆర్థిక సహాయం అందించినందుకు ప్రణవ్ బాబుకు మొగిలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరుణ సదానందం, కాంగ్రెస్ నాయకులు రేణుకుంట్ల రవీందర్, జంగా మహిపాల్, మాచర్ల మణి తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం మండల అధ్యక్షుడికి కాంగ్రెస్ నాయకుల సన్మానం

ముత్తారం, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన చేలుకల జితేందర్ యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, సర్పంచ్ పేగుడ తిరుమల కుమార్, కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ తాటిపల్లి రాజన్న మాట్లాడుతూ.. జితేందర్ యాదవ్ యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేస్తూ బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కతట్ల వినీత్, పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులు, నాయకులు, యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా అంగన్‌వాడీ ఎంపిక ప్రక్రియ: ఆర్.జే.డి కృష్ణవేణి

కరీంనగర్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): అంగన్‌వాడీ టీచర్ల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్.జే.డి) కృష్ణవేణి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన అంగన్‌వాడీ పోస్టుల అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోషణ మాసోత్సవాలను విజయవంతం చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల పనులను సీడీపీఓలు నిరంతరం పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, సీడీపీఓలు పాల్గొన్నారు.

# మత్తు మహమ్మారిని తరిమికొడదాం.. యువత భవిష్యత్‌ను కాపాడుదాం



- డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి
- ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్
- ధర్మారంలో ఘనంగా 'నషా ముక్త్ భారత్'

**మాదకద్రవ్యాల వినియోగంతో యువత భవిష్యత్ నాశనం కాకుండా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బొమ్మరెడ్డిపల్లి గ్రామంలోని మహేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ భూక్య రాంరెడ్డి నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత ఎలా దూరంగా ఉండాలి, వాటి అక్రమ విక్రయాలు, రవాణాను అరికట్టడంలో ప్రజల పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించారు.**

**ధర్మారం, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):**

### యువత భవిష్యత్‌ను కాపాడాలి

మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీస్ శాఖ చేపట్టిన 'మిషన్ పరివర్తన' కార్యక్రమం యువతకు ఎంతో దోహదపడే కార్యక్రమమన్నారు. మాదకద్రవ్యాల బారిన పడితే యువత తమ విలువైన జీవితాన్ని, భవిష్యత్‌ను కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డ్రగ్స్‌కు ఒకసారి అలవాటుపడితే దాని నుంచి బయటపడటం ఎంతో కష్టమవుతుందని, అందువల్ల యువత ప్రారంభంలోనే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆకర్షితులు కావొద్దని మంత్రి పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల కదలికలు, స్నేహాలు, ప్రవర్తనపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పిల్లలు మత్తు పదార్థాల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని అన్నారు. యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు.

### మాదకద్రవ్యాల నిర్మూలనకు మిషన్ పరివర్తన

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'మిషన్ పరివర్తన' వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేవలం పోలీసుల చర్యలతోనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యం కాదని, ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు. యువతకు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించి వారిలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజలను భాగస్వాములను చేస్తామని తెలిపారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా యువతకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు.

### డ్రగ్స్ విక్రయాలు, అక్రమ రవాణాపై కఠిన చర్యలు

పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల విక్రయాలు, గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. డ్రగ్స్ అక్రమంగా విక్రయించే వారిపై, రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువత తమ విలువైన సమయాన్ని డ్రగ్స్ కారణంగా వృథా చేసుకోవద్దని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధన కోసం కృషి చేయాలని సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని డీసీపీ కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

కార్యక్రమం అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా వాటికి దూరంగా ఉండేలా చైతన్యపరుస్తామని ప్రతిజ్ఞ చేశారు. మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేస్తామని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఏ రవీందర్,ఏసీపీ జీ. కృష్ణ,సీఐ ప్రవీణ్ కుమార్, ధర్మారం ఎస్సై ఎంబడి శ్రీకాంత్, రూరల్ ఎస్సై కె.శ్వేత ,మండల సమాఖ్య లావణ్య, బొమ్మరెడ్డిపల్లి సర్పంచ్ దారవేణి.రాజ్ కుమార్,వివిధ గ్రామాల సర్పంచులు,పోలీస్ సిబ్బంది, యువత, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పాతర్లపల్లిలో ఘనంగా 'అంగన్ మిలాన్' కార్యక్రమం

**ఇల్లందకుంట, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):**

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా చేపట్టిన "సేవా సంకల్ప అభియాన్"లో భాగంగా ఇల్లందకుంట మండలం పాతర్లపల్లిలో సర్పంచ్, బీజేపీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో "అంగన్ మిలాన్" నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణుల సంక్షేమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేయడంలో బీజేపీ శ్రేణులు నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గుత్తికొండ రాంబాబు, నాయకులు ఉప్పుల రమేష్, ఇంగ్లే ప్రభాకర్, తడిగోప్పుల రమేష్, నల్ల లింగారెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



## హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్




**కోరుట్ల, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):**

2024లో కోరుట్ల గాంధీ రోడ్‌లో జరిగిన హత్యాయత్నం, నేరపూరిత కుట్ర కేసులో చాలాకాలంగా పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు ఠాకూర్ వినయ్ సింగ్ (31) ను కోరుట్ల పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సిఐ కే. లక్ష్మీ నారాయణ పర్యవేక్షణలో ఎస్ఐ జీ. శ్యామ్ రాజ్ సిబ్బందితో కలిసి కోరుట్ల బస్‌స్టాండ్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. నిందితుడిని చాకచక్యంగా అరెస్ట్ చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని జగిత్యాల జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# రవాణా శాఖ కార్యాలయంలో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు

## ఎంవీఐ లేకుండానే డ్రైవింగ్ టెస్టుల నిర్వహణ

- ఏజెంట్ల ద్వారా అధిక మొత్తంలో వసూళ్లు
- రికార్డుల నిర్వహణ, పర్యవేక్షణలో తీవ్ర లోపాలు
- లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి: డీఎస్పీ



**కోరుట్ల, సెప్టెంబర్ 06 (ప్రజాజ్యోతి):**
కోరుట్ల రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో కరీంనగర్ రేంజ్ అవినీతి నిరోధక బ్యూరో (ఏసీబీ) అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కరీంనగర్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో కార్యాలయ రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, చలాన్లు, పెండింగ్ దరఖాస్తులు, కార్యాలయ పనితీరును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

### ఎంవీఐ లేకుండానే డ్రైవింగ్ టెస్టులు?

తనిఖీల సందర్భంగా ఎన్. గిరీష్ కుమార్ అనే రవాణా కానిస్టేబుల్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) అందుబాటులో లేని సమయంలో వాహనాలకు డ్రైవింగ్ టెస్టులు నిర్వహిస్తూ, వాహన రిజిస్ట్రేషన్లను తనిఖీ చేస్తున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ తీవ్ర అక్రమంపై అధికారులు సమగ్ర విచారణ చేపడుతున్నారు.

### ఏజెంట్ల హవా.. ప్రజల నుండి దోపిడీ

కార్యాలయంలో సాధారణ ప్రజలు తమ పనుల కోసం సమర్పించిన దరఖాస్తుల విషయంలో ఏజెంట్లకు స్వేచ్ఛగా ప్రవేశం కల్పిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. ఏజెంట్లు కార్యాలయ సిబ్బందితో నేరుగా వ్యవహరిస్తూ, ప్రజలకు అధికారిక సేవలు అందిస్తామని చెప్పి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఏసీబీ పరిశీలనలో నిర్ధారణ అయింది.

### డ్రైవింగ్ ట్రాక్‌తో పాటు రికార్డుల్లోనూ లోపాలు

కార్యాలయంలో రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా లేదని, కింది స్థాయి ఉద్యోగులపై తగిన పర్యవేక్షణ కొరవడిందని అధికారులు మండిపడ్డారు. అంతేకాకుండా డ్రైవింగ్ టెస్టులు నిర్వహించే ప్రదేశం రవాణా శాఖ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేదని, సూచిక బోర్డులు లేకపోవడం వంటి పలు లోపాలను గుర్తించారు.





### లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి: డీఎస్పీ

ఈ సందర్భంగా కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు ఏమాత్రం భయపడకుండా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు లేదా వాట్సాప్ నంబర్ 9440446106కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తి గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ తనిఖీల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు ప్రేమ్ కుమార్, తిరుపతి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులతో వెళ్తున్న టాటా మ్యాజిక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

**కోరుట్ల, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):**
కోరుట్ల పట్టణంలో మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు టాటా మ్యాజిక్ వాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో పలువురు విద్యార్థులతో పాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో పదో తరగతి ప్రత్యేక తరగతులు ముగించుకుని టాటా మ్యాజిక్‌లో కథలాపూర్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన వారిని స్థానికులు వెంటనే కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.









## కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం: అబ్దుల్ ఖయ్యూం

- కోరుట్ల టౌన్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా నియామకం
- పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తానని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం



**కోరుట్ల, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి):**
కోరుట్ల టౌన్ కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్‌గా అబ్దుల్ ఖయ్యూం నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి కీలకమైన బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు లభించిన ఈ పదవిని అలంకారప్రాయంగా కాకుండా పార్టీకి, ప్రజలకు సేవ చేసే గొప్ప బాధ్యతగా భావిస్తున్నానని ఖయ్యూం పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగారావు, పీసీసీ నాయకులు జువ్వాడి కృష్ణారావు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్‌లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఖయ్యూం మాట్లాడుతూ.. నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ కార్యకర్తలను, సీనియర్ నాయకులను సమన్వయం చేసుకుని కోరుట్లలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేసేందుకు నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు.